క్లుప్తంగా

పరామర్శ



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన దుర్గమ్మ, మల్లేశ్, పెద్దతూండ్ల కిషన్ రావుపల్లికి చెందిన చంద్రయ్య, అడ్వాలపల్లికి చెందిన రాజులు ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, వాల యాదగిరిరావు, బాలజీ, రమేశ్, సమ్మయ్య, రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు నిర్వహించుకోవాలి

కాటారం: మార్చి 8న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఇంటింటా నిర్వహించుకోవాలని, ప్రతి ఇంట్లో మహిళను గౌరవంగా సన్మానించాలని ప్రజాసంఘాల నాయకుడు పీక కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ ఇంట్లో మహిళ పాత్ర ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. ఓ పక్క మహిళలు ఎంతో ముందుకెళ్తున్న కొన్ని చోట్ల గృహహింస, సామాజిక హింస, హత్యలు, అఘాయిత్యాలు, అత్యాచారాలు, వేధింపులకు గురికావడం బాధాకరమన్నారు.

సాగునీరు అందించాలి



ములుగు రూరల్: యాసంగి పంటలను సాగునీరు అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేవగిరిపట్నం, పత్తిపల్లి, చింతలపల్లి గ్రామాల్లో వరిని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎదల్ల చెరువు, రంగాయ చెరువు ఆయకట్టులో సాగు చేసిన వరికి నీరు అందక ఎండిపోతుందని అన్నారు. దేవాదుల పైప్‌లైన్ ద్వారా నీటిని అందించి పంటను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

సమ్మక్క–సారలమ్మ జాతర

మంగపేట: మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలోని మామిడిగూడెంలో కొలువుదీరిన సమ్మక్క–సారలమ్మ జాతర మంగళవారం నుంచి ఈనెల 08 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి(దేవరబాల) పూనెం జనార్దన్ తెలిపారు. జాతర ప్రారంభంలో భాగంగా మండెమెలిగె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెలు రేగ లక్ష్మయ్య, తలపతి పూనెం వెంకటేశ్వర్లు, నిర్వాహకులు వాసం సాంబశివరావు, ఎట్టి సాయి, తాటి చందు, నాగమల్లేశ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

ఏటూరునాగారం: ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ సంస్థ లింక్ వర్కర్ కిషన్, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్, మానసపల్లి ప్రాంతాల్లో మిషన్ 95 హెల్త్ క్యాంపు నిర్వహించి పలువురికి పరీక్షలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీటీసీ సెంటర్‌లో హెచ్‌ఐవీ పరీక్ష ఉచితంగా చేయడంతోపాటు కౌన్సిలింగ్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. క్యాంప్‌లో వైఆర్‌జీ కేర్ సూపర్‌వైజర్ రజిని, ఆశ వర్కర్ నాగమణి పాల్గొన్నారు.

అధికలోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీ పట్టివేత

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద ఇసుక లారీల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ శంకర్, కానిస్టేబుల్ లక్ష్మణ్‌నాయక్‌లు కలిసి అధికలోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరించారు. మంగళవారం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేయగా ఏటూరునాగారం క్వారీ నుంచి అధిక లోడుతో వెళ్తున్న లారీని పట్టుకున్నామన్నారు.

బిల్లులు చెల్లించాలి

మంగపేట: మండలంలోని చుంచుపల్లిలోని చెంచులక్ష్మి, నర్సింహాస్వామి ఎస్టీ ఇసుక క్వారీ సొసైటీ ఇసుక క్వారీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి పెడింగ్ బిల్లులు చెల్లిస్తే గిరిజన కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు.

మొక్కజొన్న వైపు మొగ్గు

- పెట్టుబడి, కూలీల ఖర్చు తక్కువ
- ఆసక్తి చూపుతున్న రైతులు
- యాసంగిలో పెరిగిన సాగు విస్తీర్ణం



జగ్గయ్యపేటలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

రేగొండ: యాసంగి సీజన్‌లో రైతులు మొక్కజొన్న పంట సాగుపై మొగ్గు చూపడంతో గతంలో ఎన్నడు లేని విధంగా సాగు విస్తీర్ణం పెరిగింది. నీటి సౌకర్యం ఉన్న రైతులు మొక్కజొన్న పైనే మక్కువ చూపుతున్నారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల వ్యాప్తంగా దాదాపు 4200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. అడవి పందుల బెడద ఉన్నప్పటికీ వాటి నుంచి రక్షించుకునేందుకు సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకుని మరి సాగు చేస్తున్నారు. ముఖ్యంగా పెట్టుబడులు, కూలీల ఖర్చు తక్కువ, స్థిరమైన ఆదాయం రావడంతో రైతులు ఈ పంటను ఎంచుకుంటున్నారు.

మార్కెట్‌లో డిమాండ్

ఒకప్పుడు వానాకాలంలో మొక్కజొన్న సాగు చేసేవారు. ప్రస్తుతం వానాకాలం సాగు ఇబ్బందిగా మారుతుండటంతో యాసంగి సాగుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో పాటు ఈ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో క్వింటాకు రూ.2,350 ధర పలుకుతోంది. యాసంగిలో దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తుండడంతోనే దీనిపై మక్కువ చూపుతున్నారు.

మండల పరిధిలో..

రేగొండ మండల పరిధిలోని కనిపర్తి, నాగుర్లపల్లి, లింగాల, రేపాక, తిరుమలగిరి కొత్తపల్లిగోరి మండల పరిధిలో కొత్తపల్లిగోరి, నిజాంపల్లి, జగ్గయ్యపేట, వెంకటేశ్వర్లపల్లి తదితర గ్రామాల్లో మొక్కజొన్న విరివిగా సాగు చేస్తున్నారు. గత సంవత్సరం మద్దతు ధర రూ.2,350 లుగా ఉండగా రేగొండ పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. రైతులు మార్కెట్‌కు తరలించకుండా, దళారుల పాలు కాకుండా నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయడం వల్లే ప్రస్తుత సంవత్సరంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది.

ఐదు ఎకరాల్లో సాగు చేశా..



గత యాసంగిలో వరి పంటలో ఆశించిన దిగుబడులు రాలేదు. దీంతో యాసంగిలో ఐదు ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తున్నా. ఇతర పంటల సాగుకు పెటుబ్బడి ఎక్కువ అవుతున్నాయి. తక్కువ పెట్టుబడితో మొక్కజొన్న సాగుతో మంచి లాభాలు వస్తాయని ఆశిస్తున్నా.

- వన్నాల శివాజీ, రైతు

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

మల్హర్: మండలంలోని తాడిచర్ల జూనియర్ కళాశాలలో తొలి సారిగా నేటి(బుధవారం) నుంచి ఈనెల 25 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగున్నాయి. ఈ పరీక్షలకు మండలంలోని తాడిచర్ల జూనియర్ కళాశాల, మల్లారం కస్తూరిబా, ఎడ్లపల్లి మోడల్ స్కూల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సంబంధించిన 270 విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. తాడిచర్ల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 50 మంది, ద్వితీయ సంవత్సరం 65, ఎడ్లపల్లి మోడల్ స్కూల్ ప్రథమ సంవత్సరం 48, ద్వితీయ సంవత్సరం 65, మల్లారం కస్తూరిబా ప్రథమ సంవత్సరం 27, ద్వితీయ సంవత్సరం 15 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలకు నిర్వహణకు సెంటర్‌ల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని సెంటర్ ఇన్‌చార్జ్, ప్రిన్స్‌పాల్ విజయదేవి, సీఎస్ నరేందర్, డీఓ సదాశివు తెలిపారు.



తాడిచర్లలోని ఇంటర్ పరీక్ష కేంద్రం

కాళేశ్వరం: మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ప్రథమ సంవత్సరం జనరల్ 120, ఒకేషనల్ 39, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్ 112, ఒకేషనల్ 34 మంది హాజరుకానున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వార్షిక పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించడం జరుగుతుందని డిపార్ట్‌మెంటల్ అధికారి బుర్ర రాజబాబు తెలిపారు.

యాత్రను విజయవంతం చేయాలి

టేకుమట్ల: ప్రపంచ మానవాళికి ఆధ్యాత్మిక ప్రబోధ, మహోన్నత సేవలను అందించిన భగవాన్ శ్రీ సత్య సాయిబాబా పుణ్యక్షేత్రమైన పుట్టపర్తిలో ఈ నెల 6, 7, 8లో నిర్వహించే పర్తియాత్రను జయప్రదం చేయాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా యువజన సమన్వయకర్త వావిలాల రవితేజ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీహనుమాన్ దేవాలయంలో పుట్టపర్తి యాత్ర కరపత్రం, వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతతకు దైవచింతన ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు శ్రీనివాస్, సమితి యూత్ కోఆర్డినేటర్ గోపాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భక్తులు

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: నియోజకవర్గంలోని ప్రజలు దేవతామూర్తుల ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని మొట్లపల్లి గ్రామంలో శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం, శ్రీ భూలక్ష్మీ మహాలక్ష్మీ, కనకదుర్గ దేవతల విగ్రహాలప్రతిష్ఠాపన వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై పూజలు చేసి మాట్లాడారు. దేవుళ్ల ఆశీస్సులతో గ్రామస్తులు, నియోజకవర్గ ప్రజలు చల్లగా ఉండాలని కోరారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాకారం ఎల్లప్పుడు ఉంటుందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోకల్ సీరియల్ దందా యథావిధి!



బొమ్మాపూర్ క్వారీ వద్ద బారులుదీరిన లారీలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బొమ్మాపూర్, ఎలికేశ్వరం ఇసుక క్వారీల వద్ద లోకల్ లారీ ఓనర్లు, నాయకులు లోకల్ వాళ్లకు ముందు సీరియల్ ఇవ్వాలని రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు డబ్బులు వసూల్ చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, మంగళవారం క్వారీల వద్ద లోకల్ సీరియల్ పేరిట ఇతర ప్రాంతాల లారీలకు డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. సీఐ రామచందర్‌రావు నిర్దేశించిన మార్గం నుంచే వెళ్లాలని జారీ చేసిన ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కుదురుపల్లి నుంచి ఎల్ఎస్‌టీ రోడ్డు మీదుగా క్వారీలకు తరలిపోవాలి. కానీ మహదేవపూర్ నుంచి బొమ్మాపూర్ గ్రామాల నుంచి అంబట్‌పల్లి వరకు వెళ్లి క్వారీలకు ఎదురు వచ్చి సీరియల్ అంటూ అడ్డదారిలో ముందుంచుతూ డబ్బులు లాగుతున్నారని సమాచారం. పోలీసులు ఆదేశాలు జారీ చేసి కొన్ని లారీలపై కేసు పెట్టి మమా అనిపించారని విమర్శలు ఉన్నాయి. ఇంత జరుగుతున్న పట్టించుకోకపోవడంతో విమర్శలకు తావిస్తుంది. లోకల్ సీరియల్ పేర డబ్బులు గుంజుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు కోరతున్నారు.

ఘనంగా లైన్‌మెన్ దినోత్సవం



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, సిబ్బంది

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలో మంగళవారం లైన్‌మెన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డివిజనల్ ఇంజనీర్లు పాపి రెడ్డి, వెంకటేశం, అసిస్టెంట్ డివిజనల్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లైన్‌మెన్లు తమ అనుభవాలను పంచుకుని, సంస్థ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారిని సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చికి రూ.25 వేల ధర చెల్లించాలి

- రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి



రైతులతో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

వెంకటాపురం(కె): మిర్చికి క్వింటాకు రూ.25 వేల ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మిర్చి కల్లాలను ఆయన సందర్శించి మాట్లాడారు. జిల్లాలో 25 వేల ఎకరాల్లో రైతులు మిర్చి పంటను సాగు చేశారని అన్నారు. రెండు సంవత్సరాలుగా రైతులు గిట్టుబాటు ధర లేక, తెగుళ్లతో దిగుబడి రాక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 6న వెంకటాపురం మండలంలో నిర్వహించే మిర్చి రైతుల జిల్లా సదస్సును రైతులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యానం వాసు, తోట నాగేశ్వరావు, కట్ల నర్సింహాచారి, జిమిడి బాబురావు, రాములు, ప్రవీణ్, నవీన్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ మార్కెట్‌తో పోటీపడాలి

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని చిన్న తరహా కుటీర పరిశ్రమల నిర్వాహకులు ప్రైవేట్ మార్కెట్‌తో పోటీపడాలని మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ట్రైనర్, కన్సల్‌టెంట్ విజయ్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ పరిధిలోని కుటీర పరిశ్రమల నిర్వాహకులకు ఐదురోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రంలోని వైటీసీలో చేపట్టారు. సెంట్రల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ టూల్స్ డిజైన్ సంస్థ ద్వారా మహిళా సంఘాల నిర్వాహకులకు ట్రైనింగ్ ఇచ్చారు. శివాపురం సబ్బు పరిశ్రమ చాలా బాగా రన్ చేస్తున్నారని నిర్వాహకులు సౌజన్య, రమను అభినందించారు. కార్యక్రమంలో ట్రైనర్ ఉదయ్, సిబ్బంది ఉపేందర్, జేఆర్‌పీ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



మొగుళ్లపల్లిలో..

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఒక రోజు ఉపాధ్యాయులుగా మారి పాఠలు బోధించారు. ప్రధానోపాధ్యాయుడిగా పుల్ల హర్షవర్ధన్, ఎంఈఓగా వెల్దండి సహాస్ర, డీఈఓగా సాయి చరణ్ వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు బోధించిన తీరుపై వారి అనుభవాలను పాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కొడెపాక రఘుపతి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు బొమ్మ రాజమౌళి, సరళాదేవి, నీలిమా రెడ్డి, విజయలక్ష్మి, ఉస్మాన్ అలీ, బుర్ర సదయ్య, సుజాత, బుజ్జమ్మ, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఉత్తమ బోధన చేసిన వారికి ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి లింగాల కుమారస్వామి బహుమతులు అందజేశారు.

రేషన్ బియ్యం దందాను అరికట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని కొంతమంది రేషన్ డీలర్లు లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని తీసుకుంటూ దందాకు పాల్పడుతున్నారని సంబంధిత అధికారులు అరికట్టాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్ జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీఎస్ఓ సాయికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుపతి, తదితరులు ఉన్నారు.

ఫుట్‌పాత్‌లపై సామగ్రి ఉంచితే చర్యలు



ఫుట్‌పాత్‌పై సామగ్రి తొలగిస్తున్న ఈఓ రఘు

ములుగు: జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన నిర్మించిన ఫుట్‌పాత్‌పై వ్యాపారులు ఎలాంటి సామగ్రి ఉంచినా వెంటనే వాటిని గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకోవడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని ఈఓ పెంట రఘు హెచ్చరించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం బస్టాండ్ సమీపంతో పాటు రహదారి వెంబడి ఫుట్‌పాత్‌పై ఉంచిన సామగ్రిని స్వాధీనం చేసుకోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి తరలించారు. దీంతో వ్యాపారులు అందరు ఈఓ కార్యాలయానికి చేరుకొని తమ సామగ్రిని తిరిగి ఇవ్వాలని కోరారు. ఈఓ వ్యాపారులకు ఫైన్ వేసి ఇకముందు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే ఊరుకునేది లేదని అన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న నాయకులు

కాటారం: ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ–టీపీయూఎస్ బలపర్చిన అభ్యర్థి మల్కా కొమురయ్య విజయం సాధించడాన్ని హర్షిస్తూ మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబురాలు నిర్వహించుకున్నారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ.. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి తోడుగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాగె రంజిత్, ఫిల్మ్ సెన్సార్‌బోర్డు సభ్యుడు దుర్గం తిరుపతి, జిల్లా కౌన్సిలర్ మెంబర్ బొమ్మన భాస్కర్‌రెడ్డి, నాయకులు బండం మల్లారెడ్డి, పిలుమర్రి సంపత్, ఆత్మకూరి స్వామియాదవ్, డోలి అర్జయ్య, మంత్రి సునీల్, అశోక్‌రెడ్డి, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎంఈఓ జీవీవీ సత్యనారాయణ



ప్రోత్సాహకాలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వెంకటాపురం(కె): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. అనంతరం గత పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాలలో 1988–89 పదో తరగతి విద్యార్థులు ప్రోత్సాహకాలను అందజేశారు. హైదరాబాద్ సీటీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పూర్వ విద్యార్థి చిన్ని కృష్ణ ఆధ్వర్యంలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.పది వేలు, ద్వితీయ, తృతీయ స్థానంలో ఉన్న విద్యార్థులకు రూ.5 వేలు అందజేశారు.

బీఎస్పీతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తడికెల శివ కుమార్

వాజేడు: బీఎస్పీ రాజ్యాధికారం సాధించడం ద్వారా ప్రజా సమస్యలు అన్ని పరిష్కారం అవుతాయని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం ఇన్‌చార్జ్ తడికెల శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జ్ కుమ్మరి రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం బహుజన సమాజ్ పార్టీతో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని అన్నారు. ఈ సమావేశంలో కొండా చరణ్, మధు, సాంబ శివరావు, ఏసు, రాంబాబు, బాబు, అజ్జు, శివ, శేషు కుమార్ తదితరులున్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఏటీడబ్ల్యూఓ క్షేత్రయ్య



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న క్షేత్రయ్య

వెంకటాపురం(కె): పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏటీడబ్ల్యూఓ క్షేత్రయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గిరిజన బాలుర వసతి గృహం, చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సోమ్లు, వార్డెన్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.